సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



దర్జాగా.. దొంగతనాలు!

రాజంపేటలో దొంగలు పడ్డారు. ఇంటికి తాళం కనిపిస్తే..ఆ ఇంటిలో దొంగలు బీభత్సం సృష్టించి అందిన కాడికి దోచుకెళుతున్నారు. -8లో



నెట్‌బాల్, బాస్కెట్‌బాల్ జట్లు ఎంపిక

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నెట్‌బాల్, బాస్కెట్‌బాల్ అండర్-19 బాల,బాలికల జట్లను స్థానిక జీటీ కాలేజీ మైదానంలో ఎంపిక చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.520	రూ.600
రెండోరకం	రూ.380	రూ.500

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 114 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు.తలనీలాలు అర్పించారు. వర్షాలు కురిపించి అందరూ చల్లగా ఉండేలా కాపాడు తల్లీ అంటూ వేడుకున్నారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేకాధికారి మారుతీ ప్రసాద్‌లు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. పూజారులు చెల్లు వంశీయులు గంగరాజు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

పండగకు 758 ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ పరిధిలో కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో 758 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నామని ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. సాధారణ చార్జీలతోనే బస్సులను నడుపుతామని వారు పేర్కొన్నారు. అక్టోబర్ 4 నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, చెన్నై, కర్నూలు, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ఆలంఖాన్‌పల్లి సమీపంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయి ఓపెన్ ప్రైజ్‌మనీ చదరంగం టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఏపీ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఈ పోటీల్లో కడప నగరానికి చెందిన రూపేష్‌రెడ్డి ప్రథమ, ప్రకాశం జిల్లాకు చెందిన ప్రసాద్ ద్వితీయ, మదనపల్లికి చెందిన విక్రమ్‌తేజ్ తృతీయ స్థానం సాధించారు. వీరితోపాటు టాప్ 20లో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజ్‌డమ్ స్కూల్ ప్రిన్సిపాల్ మెర్సీ, జిల్లా చదరంగం అసోసియేషన్ కార్యదర్శి అనిల్ దర్బారీ, కోచ్ తబుసమ్, చీఫ్ అర్బీటర్స్ గోపీనాథ్, రామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నాతియా మెహఫిల్



మాట్లాడుతున్న హజరత్ సయ్యద్ షా మహమ్మద్ షేక్షాద్ హుసేని సాహెబ్

కడప కల్చరల్: కడప నగరంలోని అస్థానె హుసేనియా పీఠంలో ఆదివారం పవిత్ర మిలాదున్ నబీ మాసోత్సవం సందర్భంగా నాతియా మెహఫిల్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాత్ ఖాన్‌లు పాల్గొని ప్రవక్త పట్ల తమ భక్తిని చాటుకున్నారు. అస్థానె హుసేనియా పీఠాధిపతి సయ్యద్ షా మహమ్మద్ షేక్షాద్ హుసేని సాహెబ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి నాతియా మెహఫిల్ నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కవులు తమ నాతియ కలాంలతో అత్యద్భుతంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో అప్పుల వడ్డన!


సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాల్లో విద్యార్థుల ఆకలి తీర్చిడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా బిల్లులు అందడం లేదు. ఫలితంగా వార్డెన్లపై అప్పుల భారం పెరుగుతోంది. వంటలో నాణ్యత కొరవడుతోంది. దీనికి తోడు కూరగాయల ధరల పెరుగుదల భోజనంపై ప్రభావం చూపుతోంది. హాస్టల్లో వడ్డించే భోజనం విద్యార్థులకు మింగుడుపటం లేదు. వసతి గృహాల్లో అందించే భోజనంపై తల్లిదండ్రుల్లో సైతం ఆందోళన వ్యక్తమవుతోంది. బిల్లులు మంజూరు చేయాలని వార్డెన్లు నెలల తరబడి వేడుకుంటున్నా కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదు.

- వసతిగృహాలకు మంజూరు కాని బిల్లులు
- వార్డెన్లకు వడ్డింపు కష్టాలు
- విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం



మదనపల్లెలోని బీసీ సంక్షేమ వసతిగృహం

మదనపల్లె సిటీ: జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖకు చెందిన వసతిగృహాల్లో సుమారు 7,600 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరికి ప్రభుత్వం ప్రత్యేకంగా మెనూ కేటాయించి ఆ ప్రకారం భోజనం వడ్డిస్తుంది. ఈ క్రమంలో సివిల్ సప్లయ్‌శాఖ నుంచి రేషన్ బియ్యం వసతి గృహాలకు సరఫరా అవుతుంది. ఇందుకోసం ప్రభుత్వం సివిల్ సప్లయ్‌శాఖకు కిలోకు రూ.1 చొప్పున చెల్లిస్తుంది. నెలవారీగా కిరాణా సరుకులు కాంట్రాక్టు తీసుకున్న వారి నుంచి సరఫరా అవుతాయి. వారి నుంచి నెలకు సరిపడా 18 రకాల సరుకులు నేరుగా వసతి గృహాలకు చేరుతాయి. పాలు,గుడ్లు, కూరగాయాలు, చికెన్, వంటగ్యాస్ తదితరాలను విద్యార్థుల మెనూ చార్జీల ద్వారా నడిస్తుంటారు. ఈ చార్జీలను ఆయా వసతిగృహాల వార్డన్లు భరిస్తుంటారు. అయితే మెనూ బిల్లుల సకాలంలో అందక భోజన వడ్డింపులో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. బిల్లులు రాక వార్డెన్‌లపై అప్పులభారం పడుతోంది.



కానరాని నిర్వహణ నిధులు

వసతిగృహాల నిర్వహణ నిధులను ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో విద్యుత్ బల్బులు, మరుగుదొడు, మూత్రశాలల నిర్వహణ, చిన్నపాటి కిటికీలు, తలుపుల మరమ్మతులకు సొంత సొమ్మును వార్డెన్లు వెచ్చించాల్సి వస్తోంది. హాస్టల్ నిర్వహణకు ప్రతి నెలా కనీసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తున్నట్లు వార్డెన్లు చెబుతున్నారు .ప్రభుత్వం స్పందించి వసతి గృహాలకు సకాలంలో బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

మెనూ చార్జీలు ఇలా..

సాధారణ వసతిగృహంలో ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రోజుకూ రూ.46, కాలేజీ వసతిగృహాల్లో ఒక్కో విద్యార్థికి భోజన ఖర్చులకు రూ.53 చెల్లిస్తుంది. ఈ కేటాయింపులతో నెలకు సాధారణ వసతి గృహంలో ఒక్కో విద్యార్థికి రూ.1400, కాలేజీ విద్యార్థికి రూ.1,600 చెల్లించాల్సి వుంది. ఈ లెక్కన మెనూ ప్రకారం వారానికి ఆరు కోడిగుడ్లు, ప్రతి ఆదివారం బిరియానీ,అరటిపండ్లు, పాలు, కూరగాయాలతో కూడిన ఆహారం అందించాల్సి ఉంది. అయితే బిల్లుల చెల్లింపులో జాప్యం చోటు చేసుకోవడంతో సరైన భోజనం అందించడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరల ప్రభావం

గత కొన్ని రోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తెల్లగడ్డ కిలో రూ.340 నుంచి రూ.400 వరకు, అల్లం రూ.170, ఉల్లి కిలో రూ.50 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. టమాటా కిలో రూ.35, పచ్చిమిరప కిలో రూ.60 విక్రయిస్తున్నారు. ఈ ధరల దెబ్బకు వసతి గృహాల విద్యార్థులకు రుచికరమైన,నాణ్యమైన భోజనం అందడం లేదు. ఇచ్చే మెనూ చార్జీలకు, పెరిగిన కూరగాయల ధరలకు పొంతన లేదని, ఇలాగైతే నిర్వహణ కష్టమని వార్డెన్లు వాపోతున్నారు.

బిల్లులు పెండింగ్



బీసీ హాస్టల్‌లో భోజనం తింటున్న విద్యార్థులు

ఈ ఏడాది జనవరి వరకు గత ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. ఫిబ్రవరి నెల నుంచి ఇప్పటి వరకు బిల్లులు రావాల్సి ఉంది. పెండింగ్ బిల్లులు వార్డెన్లకు అప్పులను తెచ్చిపెతున్నాయి.అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నారు. అప్పులు కూడా తలకు మించిన భారం కావడంతో ఏం చేయాలో తెలియక తికమకపడిపోతున్నారు. మెనూ చార్జీలను చెల్లించాల్సి ఉందని వసతిగృహ వార్డెన్లు దిగాలుగా చెబుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



మెనూ చార్జీలు ఇవ్వక పోవడంతో విద్యార్థుల భోజనంపై ప్రభావం పడుతుంది. మెనూ బిల్లుల బకాయిలు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలి.

-మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు

త్వరలో బిల్లుల చెల్లింపులు



వసతిగృహాల మెనూ బిల్లులు త్వరలో చెల్లిస్తాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వరుస క్రమంలో బిల్లులు అందుతాయి.

-బి.సందప్ప, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలి

ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి



మాట్లాడుతున్న ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుకు అవసరమైన వివిధ అనుమతులను సింగిల్ విండో విధానంలో అమలు చేయాలని ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకరరెడ్డి కోరారు. స్థానిక రవీంద్రా హైస్కూల్‌లో ఆదివారం కడప, అన్నమయ్య జిల్లాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం కార్యనిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనానికి ఎన్‌ఓసీ, ఫైర్ వంటి అన్ని అనుమతులను ఒకేసారి ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాల గుర్తింపును 8 ఏళ్లకు బదులు 10 ఏళ్లకు పెంచాలని, వాహనాల ఇన్సూరెన్స్ ప్రీమియంను తగ్గించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ట్రిపుల్ ఐటీ ఎంపికలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పట్ల వివక్ష చూపడం తగదని, విద్యా రంగానికి సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రైవేటు విద్యాసంస్థల సంఘాలతో చర్చించాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని త్వరగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్బారెడ్డి, పట్టణాధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి రాజారాం, మదనపల్లె పట్టణాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే కల్తీ నెయ్యి అక్రమాలు

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం బెడిసికొట్టిందని, దీంతో ఏమి చేయాలో అర్థం కాని కూటమి ప్రభుత్వం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకొని డిక్లరేషన్ ఇవ్వాలనడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుతంత్రం అని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాకే తిరుమలకు నెయ్యి సరఫరా చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగితే మాజీ సీఎం వైఎస్ జగన్‌హన్ రెడ్డిపై నిందలు వేయడం సమజంసం కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తూ నెయ్యిలో జంతువుల కొవ్వు వాడారని చెప్పడం తిరుమల పవిత్రను, విశిష్టతను, హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే అని మాజీ ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమేని పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, నాయకులు రఘు, విశ్వనాథ్, వెంకట్రమణ రెడ్డి, బాబు, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి అర్బన్: ఉపాధ్యాయులకు విద్యాబోధనతో పాటు క్రీడల ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం పొందాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పుడూ పుస్తకాలతోటి కుస్తీపడుతున్న నేపథ్యంలో యూటీఎఫ్ అధ్యయనం, సామాజికస్పృహ అనే సిద్ధాంతాలతో ముందుకు సాగడం సంతోషదాయకమన్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరి ప్రసాద్,జాబీర్ లు మాట్లాడుతూ క్రీడలతో కలిగే మానసిక, శారీరక ఉల్లాసం కారణంగా ఉపాధ్యాయులు ఒత్తిడి లేని బోధనను కొనసాగించగలుగుతారన్నారు. అనంతరం చెస్, క్యారమ్స్, క్రికెట్, షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లానేతలు చంద్రశేఖర్, దావుద్దీన్, వెంకటసుబ్బయ్య, రమణ మూర్తి, సురేంద్రారెడ్డి, చంగల్‌రాజు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆగిన 'అభివృద్ధి'..

కనిపించని చిత్తశుద్ధి



రాయచోటి నేతాజీ సర్కిల్‌లో ప్రారంభానికి నోచుకోని జాతీయ చిహ్నం



గున్నికుంట్ల క్రాస్ రోడ్డు సర్కిల్‌లో నిర్మాణ దశలో ఆగిన చిరుత చిహ్నం



మాసాపేట-వేంపల్లి క్రాస్ రోడ్డు సర్కిల్‌లో నిర్మాణ దశలో ఆగిన అందమైన చిహ్నం

- మిన్నకుండిపోయిన కూటమి ప్రభుత్వం
- వందరోజులైనా జిల్లా కేంద్రంలో అసంపూర్తిగానే పనులు

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో అభివృద్ధి పనులు ఆగిపోయాయి.కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించకుండా మిన్నకుండిపోయింది. ఫలితంగా గత ప్రభుత్వంలో నూతన జిల్లా ఆవిష్కరణ, కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులు పరుగులు తీస్తాయని ఆశించిన ప్రజలకు ఆశాభంగం ఎదురైంది.రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొందిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మంత్రి వర్గంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. దీంతో రాయచోటి అభివృద్ధికి అడ్డంకులు ఉండవని ప్రజలు భావించారు. వారి అంచనాలను తలకిందులు చేస్తూ కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో రాయచోటి పట్టణం, నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపట్ల పెదవి విరిస్తున్నారు.

నిలిచిపోయిన సర్కిళ్ల సుందరీకరణ

రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో కోటి రూపాయలతో కూడళ్ల సుందరీకరణ పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ పాలక వర్గం సమన్వయంతో చేపట్టిన పనులు 90శాతం వరకు పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికలు కాంట్రాక్టర్ పనులు నిలుపుదల చేశారు. పట్టణంలోని నేతాజీ సర్కిల్, మాసాపేట, వేంపల్లి క్రాస్ రోడ్డు, చిత్తూరు రహదారి మార్గంలోని రింగ్ రోడ్డు సర్కిల్, గుణ్ణికుంట్ల రింగ్ రోడ్డు సర్కిళ్లలో పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. వీటిని సుందరీకరిస్తే పట్టణానికి మరింత శోభ పెరుగుతుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల సమీపంలో ఉన్న రింగ్ రోడ్డు సర్కిల్‌లో అన్నమయ్య విగ్రహం ఏర్పాటుతో ఆ ప్రాంతం చూడముచ్చటగా తయారైంది. ఎస్ఎన్ కాలనీలో టవర్ క్లాక్ నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో మంత్రి వీటిపై చర్చించాలని, ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మంత్రి జిల్లాకు రాక

రాయచోటి: రాష్ట్ర రవాణ, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి రానున్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి పర్యటనపై కలెక్టర్ కార్యాలయం నుంచి పత్రికలకు విడుదలైన ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం తిరుపతి నుంచి రోడ్డు మార్గాన రాయచోటికి వస్తారు. అనంతరం మున్సిపల్ సమావేశంలో పాల్గొంటారు.

3 నుంచి టెట్ పరీక్షలు



టీసీ కోడ్	పరీక్ష కేంద్రం	చిరునామా
2298	విశ్వం ఇంజనీరింగ్ కాలేజీ	శ్రీ విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నేషనల్ హైవే 205 అంగళ్లు, మదనపల్లె
3784	మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్	పోస్ట్ బాక్స్ నంబర్-14, కదిరి రోడ్డు, అంగళ్లు విలేజ్, మదనపల్లె
33902	శ్రీ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్	మాసాపేట, గొల్లపల్లి విలేజ్, రాయచోటి
38751	భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్	రాయచోటి టు కడప హైవే, బండపల్లి, మాసాపేట పోస్ట్, రాయచోటి

రాయచోటి (జగదాంబసెంటర్) : జిల్లాలో పలు కేంద్రాల్లో అక్టోబర్ 3వ తేదీ నుంచి ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీ టెట్), జులై-2024(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో అక్టోబర్ 3వ తేదీ నుంచి 21 వరకు రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. అభ్యర్థులు వారి హాల్ టికెట్లను https://aptet/apcfss.in వెబ్‌సైట్ ద్వారా పొందాలని సూచించారు.

క్లుప్తంగా

పిడుగు పాటుకు రెండు పాడి ఆవులు మృతి


రామసముద్రంలో మృతి చెందిన పాడి ఆవులు

రామసముద్రం : రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువబొంపల్లి గ్రామంలో పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దిగువబొంపల్లి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, సుశీలమ్మలు ఇటీవల జీవనోపాధి కోసం రెండు పాడి ఆవులు తీసుకొచ్చారు. వాటిని ఇంటి సమీపంలోని రేకుల షెడ్డులో కట్టేశారు. రాత్రి మూడు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడిగుపడి రెండు ఆవులు మృతి చెందాయి. ఒక్కో ఆవు రూ.70 వేలు విలువ చేస్తుందని బాధితులు విలపించారు. జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ రెడ్డిశేఖర్‌లు రైతు కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ బాధితులకు కొంత ఆర్థిక సహాయం చేశారు.

కందిరీగల దాడిలో..


భాస్కర (ఫైల్)

పెద్దమండ్యం : కందిరీగల దాడిలో ముగ్గురికి గాయాలు కాగా, వీరిలో ఒకరు మృతి చెందారు. మండలంలోని బండ్రేవులో ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. బండ్రేవుకు చెందిన పొట్లపల్లె భాస్కర (42) ఆర్‌ఎంపీ వైద్యుడుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి సమీపంలో రైతు మల్లికార్జునరెడ్డి పొలం వద్ద భార్యతో కలిసి ఉంటూ పాడి ఆవులను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం మామిడి తోటలో దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ రాగా భార్య రమణమ్మ (36), బండ్రేవు హరిజనవాడకు చెందిన అలుగింటి కదిరప్ప (60)తో కలిసి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు. అయితే ట్రాక్టర్ దున్నుతుండగా అడ్డుగా ఉన్న తాటిపట్టను పక్కకు తీయడంతో కంతిరీగల గుంపు అక్కడే ఉన్న ముగ్గురిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని 108 వాహనంలో తంబళ్లపల్లె ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ భాస్కర మృతి చెందాడు. బండ్రేవు బస్టాండు కూడలి వద్ద ఆర్‌ఎంపీ వైద్యుడుగా ఉంటూ అందరికి తమవంతు సేవలందిస్తున్న అతని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ఇంటర్ ఆర్‌జేడీపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్ నాన్‌టీచింగ్, కాంట్రాక్టు అధ్యాపకుల బదిలీలలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఇంటర్ ఆర్‌జేడీ రవిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యరంగంలో బదిలీలను నిషేధించినప్పటికీ, ఇంటర్ ఆర్‌జేడీ మాత్రం రాయలసీమ జోన్ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ ప్రమోషన్లు, కాంట్రాక్ట్ లెక్చరర్ల బదిలీలకు సంబంధించి లక్షల్లో వసూలు చేశారని ఆరోపించారు. ఈ బదిలీలను రద్దు చేసి నిబంధనల ప్రకారం సీనియర్లకు అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నంద కిషోర్, కుమార్, రమణారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు

దర్జాగా.. దొంగతనాలు!

- రాజంపేట, నందలూరులో భయాందోళనలు
- సబ్‌డివిజన్‌లో వరుస దొంగతనాలు
- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న వైనం
- ఇంటికి తాళం కనిపిస్తే.. వాలిపోతున్న దొంగలు


శ్రీకృష్ణదేవరాయనగర్‌లోని ఓ ఇంటిలో దొంగలు బీభత్సం సృష్టించిన దృశ్యం



రాజంపేట : సబ్‌డివిజన్ కేంద్రమైన రాజంపేటలో దొంగలు పడ్డారు. ఇంటికి తాళం కనిపిస్తే..ఆ ఇంటిలో దొంగలు బీభత్సం సృష్టించి అందిన కాడికి దోచుకెళుతున్నారు. దొంగతనాలు చేసి సులువుగా పారిపోవడానికి హైవేకు, రైల్వేకి సమీపంలో ఉన్న ప్రాంతాలపై దొంగలు దృష్టి సారించినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజంపేట, నందలూరు, ఒంటిమిట్టలో గుర్తుతెలియని వ్యక్తులు సంచారం చేస్తున్నారు. ముందురోజు రెక్కీ నిర్వహించుకుంటున్నారు. ఆపై తాము ఎంచుకున్న ఇళ్లనే టార్గెట్ చేసుకొని దొంగతనాలు చేస్తున్నారు. పైగా రాజంపేట పట్టణ పరిధిలో ముగుర్గు సీఐలు, రెండు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలోనే వరుస దొంగతనాలు జరగడంపై జనం పెదవి విరుస్తున్నారు.

తాజాగా కృష్ణదేవరాయనగర్‌లో..

ఆదివారం తెల్లవారుజామున పట్టణ శివారు ప్రాంతమైన భువనగిరిపల్లె ఆర్చి సమీపంలోని శ్రీ కృష్ణదేవరాయలు నగర్‌లో ముదాం రవి ఇంటిలో తలుపులు బద్దలు కొట్టి, ఇంటిలో బీభత్సం సృష్టించారు. రూ.5లక్షలు విలువ చేసే 70 గ్రాముల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అంతేగాకుండా ఇంటిలో సీసీ కెమెరాలు ఉన్న తరుణంలో వాటికి సంబంధించి హార్డ్‌డిస్క్‌ను తమ వెంట తీసుకెళ్లడం గమనార్హం. ఇక పోలీసులు సంఘటన స్థలానికి రావడం, పరిశీలన చేయడం మామూలే. ఇందులో సీఐ యల్లమరాజు, ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏఎస్‌ఐ రాజు, హెడ్‌కానిస్టేబుల్ ఖాసీం తదితరులున్నారు.

నందలూరు గొల్లపల్లెలో ఏకంగా నాలుగిళ్లలో..

నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె అర్బన్‌లోని గొల్లపల్లె గ్రామంలో ఏకంగా నాలుగిళ్లలో దొంగలు టార్గెట్ చేసుకున్నారు. జీ.గోపి ప్రసాద్ గొబ్బిళ్ల మలికార్జున, గోపినేని వెంకటసుబ్బమ్మ ఇళ్లలో దొంగలు చొరబడ్డారు. కాగా ఆనంది రమాదేవి ఇంటి తలుపులను దొంగలు బాదారు. ఆమె భయపడి తలుపు తీయలేదు. తలుపులు బాదడంతో ఆటోమేటిక్ లాక్ కావడంతో దొంగలకు తలుపులు తీయడం సాధ్యం కాలేదు. ఫోన్ ద్వారా గ్రామంలో తమ సంబంధీకులకు కాల్‌చేయడంతో వారు రావడం.. దొంగలు పరారీ కావడం జరిగింది. కాగా ఆదివారం తెల్లవారుజామున మళ్లీ గొల్లపల్లెలో బైకులలో దొంగలు సంచరించారు. ఏది చిక్కినా వదిలేట్లు లేరని తెలుస్తోంది.

మొన్న కృష్ణానగర్..

ఈ నెల 22న పట్టణంలోని కృష్ణానగర్‌లో అధ్యాపకుడు నాగరాజు, ఇంద్రావతి దంపతుల స్వగృహంలో చోరీ జరిగింది. బాధితుల పిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. 15 తులాలు బంగారు, రూ.2లక్షల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదు ఇచ్చారు. చోరీ సంఘటనతో సంఘటన స్థలాన్ని సీఐ యల్లమరాజు, ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డిలు సందర్శించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

రాత్రిపూట గస్తీని పెంచాము



దొంగతనాలు అరికట్టే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. రాత్రి పూట గస్తీని పెంచాము. దొంగతనాలు చేసిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశాము. త్వరలో దొంగతనాలకు పాల్పడిన వారిని పట్టుకుంటాము. ప్రజలెవ్వరూ ఆందోళన చెందనవసరంలేదు. ఎస్‌ఐ నుంచి కానిస్టేబుల్ వరకు రాత్రి వేళలలో పకడ్బందీగా విధులు నిర్వహించేలా ఆదేశించాము.

-సుధాకర్, డీఎస్పీ, రాజంపేట

ఆటోమాటిక్‌గా డోర్‌లాక్ పడటంతో మేలు జరిగింది



తాను ఇంటిలో ఉంటే దొంగలు తలుపులు బాదారు. నేను కేకలు వేశాను. బయట ఉన్న దొంగలు లెక్కచేయలేదు. చివరికి మా ఇంటి డోర్ ఇన్‌సైడ్ లాక్ పడిపోయింది. దీంతో దొంగలు ఇంటిలోకి ప్రవేశించలేకపోయారు. ఈ లోపు మాకు సంబంధించిన వారికి ఫోన్ చేయడం, వారు రావడం జరిగింది. వారి రాకను గమనించి దొంగలు పరారీ అయ్యారు. గొల్లపల్లెలో పోలీసులు నైట్‌బీట్ ఉంటే మంచిది.

-ఆనంది రమాదేవి, గొల్లపల్లె, నాగిరెడ్డిపల్లె అర్బన్

విద్యుత్ షాక్‌తో వ్యక్తి దుర్మరణం

నందలూరు : విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నందలూరులో జరిగింది. వివరాలు ఇలా.. మండలంలోని పొత్తపి గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ స్థానికంగా ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఓ ఇంట్లో ఎలక్ట్రిషన్ పని చేస్తుండగా షాక్‌కు గురై దుర్మరణం చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక డంప్ సీజ్



పెనగలూరు : పెనగలూరు మండలం, కట్టావారిపల్లి పంచాయతీ, అప్పారాజుపేట గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ ఇసుక నరసయ్య నాయుడు ఇంటి ముందు ఉండటంతో నరసయ్య నాయుడు, జయచంద్ర నాయుడు, జె.ప్రకాష్ నాయుడులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దొంగతనం కేసుల్లో రూ.28లక్షల నగల రికవరీ


రికవరీ చేసిన సొమ్ములతో పాటు నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

మదనపల్లె : మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన దొంగతనాలకు సంబంధించి ఏడు కేసుల్లో రూ.28లక్షల సొత్తు రికవరీతో పాటుగా అంతర్ రాష్ట్ర నేరస్తుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. ఆదివారం సాయంత్రం తాలూకా పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మదనపల్లె, చుట్టుపక్కల మండలాల్లో జరిగిన దొంగతనాలపై పోలీసులు నిఘా పెట్టారన్నారు. ఇందులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మదనపల్లె-రామసముద్రం మార్గంలోని కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీ ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఓ వ్యక్తి, మైనర్ బాలుడు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకున్నారన్నారు. విచారణలో, మైనర్ బాలుడితో కలిసి మదనపల్లె మున్సిపల్, మండలంలో 5 చోట్ల, ముదివేడు-1, ములకలచెరువు-1 మొత్తం 7 కేసుల్లో నిందితులుగా తేలిందన్నారు. పగలు, రాత్రి సమయాల్లో దొంగతనాలు చేస్తున్నట్లు వివరించారు. నిందితులు కర్నాటక కోలార్ జిల్లా శ్రీనివాసపురం తాలూకా గంగరగానిపల్లెకు చెందిన టీసీ నాగరాజ(30), బైరుగానిపల్లెకు చెందిన మైనర్ బాలుడిగా గుర్తించామన్నారు. వీరిమీద మర్డర్ కేసుతో పాటు పలు స్టేషన్ల పరిధిలో దొంగతనాలు, కర్నాటక నుంచి ఏపీలోకి మద్యం అక్రమ రవాణా కేసులు ఉన్నాయన్నారు. కొంతకాలం క్రితం పీలేరు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేస్తే పోలీసుల కళ్లుకప్పి పారిపోయాడన్నారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని మదనపల్లె, ముదివేడు, ములకలచెరువు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 7 దొంగతనం కేసులకు సంబంధించి నిందితుల నుంచి రూ.28లక్షల విలువచేసే 400 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.12వేలు విలుచేసే 120 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో తాలూకా సీఐ కె.కళావెంకటరమణ, వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌ఐ హరిహరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా నెట్‌బాల్,బాస్కెట్‌బాల్ జట్లు ఎంపిక


జిల్లా బాస్కెట్‌బాల్ బాల,బాలికల జట్టుకు ఎంపికైన క్రీడాకారుతో పీడీలు, కోచ్‌లు

మదనపల్లె సిటీ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నెట్‌బాల్, బాస్కెట్‌బాల్ అండర్-19 బాల,బాలికల జట్లను స్థానిక బీటీ కాలేజీ మైదానంలో ఆదివారం ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. కార్యక్రమంలో పీడీలు నాగరాజు, దేవకమ్మ, రమేష్‌బాబు పాల్గొన్నారు.

అండర్-19 బాలురు నెట్‌బాల్ జిల్లా జట్టు

పి.సందీప్‌నాయుడు, ఎం.చరణ్‌తేజ, డి.గురుమధు, ఎస్.ఫయాజ్, వి.హర్షవర్దన్, ఎస్.మోహన్‌రామ్, ఎం.మణికంఠ, వై.శ్రీరామ్, ఎస్.హమీద్ హుస్సేన్, ఎం.ప్రేమ్‌చంద్, ఎస్.సతీష్, ఎం.జగదీష్, స్టాండ్ బైలుగా వి.సుధీర్‌కుమార్, ఎన్.ప్రవీణ్, పి.సునీల్, జయసూర్య

బాలికలు : బి.పల్లవి, గ్రీష్మ, డి.దీక్షిత, బి.జాహ్నవి, కె.దివ్యశ్రీ, వి.శ్రావణి, టి.భుష్మ, పి.దీపిక, ఎం.శశికళ, ఎస్.లావణ్య, ఎస్.సింధు, పి.లావణ్య

అండర్-19 బాలుర బాస్కెట్‌బాల్ జిల్లా జట్టు

కె.చరణ్‌తేజ, ఎస్.వికాస్, బి.హనుమంతు, జె.బన్నీ, టి.అబ్దుల్లా, ఎస్.సాహిద్ ఇర్ఫాన్, ఎస్.యశ్వంత్, ఎం.జగదీష్, వి.దీపు, సుదర్శన్, సంతోష్, ఉమర్‌అలీ, ఎస్.చక్రేష్, ఎస్.చరణ్‌మనోజ్

బాలికలు :

సి.జాహ్నవి, పి.చరిత, వి.మోక్షశ్రీ, గ్రీష్మ, టి.మునిసరిత, ఎం.శశికళ, పి.దీపిక, ఎస్.లావణ్య, ఎస్.సింధు, టి.భీష్మ, కౌసల్య, రికిత, స్టాండ్‌బైలుగా శరణ్య, అంజలి

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

గాలివీడు : పోక్సో కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఇదివరకే బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ద్విచక్రవాహనదారుడు


ప్రమాదంలో గాయపడిన పాలకొండ్రాయుడు

గాలివీడు : విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ద్విచక్ర వాహనదారుడు దేరంగుల పాలకొండ్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు వీరబల్లి మండలం మట్లి గ్రామానికి చెందిన పాలకొండ్రాయుడు ఆదివారం ద్విచక్ర వాహనంపై గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కరిమిరెడ్డిగారి పల్లె వద్దకు రాగానే సబ్ స్టేషన్ దగ్గర బైక్ అదుపుతప్పి ఎదురుగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయమైంది. గాయపడిన వ్యక్తి జేబులో ఉన్న ఓటరు కార్డు ఆధారంగా వివరాలు గుర్తించి వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ప్రైవేటు ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 3 నుంచి 14 వరకు దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. సెలవు రోజుల్లో వారితో వర్క్ షాప్ పేరుతో పని చేయించుకోవడం దారుణమన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వాలన్నారు.

ఈ నిరుపేదను ఆదుకోండి

- మంచానికే పరిమితమైన కుటుంబ పెద్ద
- కూలి పనులు చేసి పోషిస్తున్న అర్ధాంగి


మంచానికే పరిమితమైన కదిరప్ప

పెద్దతిప్పసముద్రం : నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన ఈ వ్యక్తి పేరు బోనాల కదిరప్ప. వ్యవసాయ పనులకు దినసరి కూలీగా వెళ్లి కుటుంబాన్ని పోషించే ఈ వ్యక్తి ఆరు నెలల క్రితం చింత చెట్టు నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో ఈ దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం తుమ్మరకుంట పంచాయతీ ఎగవ బండమీదపల్లికి చెందిన బోనాల కదిరప్ప ఆరు నెలల క్రితం చింత చెట్టులోని కాయలను రాల్చడానికి కూలీగా వెళ్లాడు. కొమ్మ విరిగి ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. వెన్నుపూస విరగడంతో పాటు రెండు కాళ్లూ చలనం లేకుండా పోయాయి. అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చినా ఫలితం లేకపోయింది. ఇక బండమీదపల్లిలో ఉన్న పురాతన కాలం నాటి ఇల్లు కూలడంతో పాటు 15 ఏళ్ల క్రితం మంజూరైన పక్కాగృహం గోడలకే పరిమితం కావడం, తన భర్తకు సపర్యలు చేసే వారు లేరని భావించిన భార్య రుక్మిణీ అష్ట కష్టాలు పడి తన భర్తను తుమ్మరకుంటలోని తన పుట్టింటికి పిలుచుకు వచ్చేసింది. పగలంతా ఆమె కూలి పనులకు వెళితే పక్కింట్లోనే ఉంటున్న రుక్మిణీ తమ్ముడు చంద్రశేఖర్ సపర్యలు చేసేవాడు. పెద్దాసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేని కారణంగా కదిరప్ప మంచంపై నుంచి లేచి కూర్చోలేక, నడవలేక నరకయాతన అనుభవిస్తున్నాడు. వీరి దీనస్థితిని గమనించిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌తో పాటు సభ్యులు ఇటీవల కదిరప్పకు ట్రై సైకిల్‌ను ఉచితంగా అందజేశారు. సైకిల్‌లో కూర్చో బెట్టాలన్నా ఇద్దరు ఉంటేనే సాధ్యమవుతుంది. కాళ్లలో చలనం లేకుండా నిర్జీవంగా మంచంపై ఉన్న ఈ నిరుపేదకు వికలాంగ పెన్షన్ మంజూరు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలని నిరుపేద కుటుంబీకులు వేడుకుంటున్నారు.

ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు సుభాషిణి

రాయచోటి అర్బన్ : ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి, జిల్లా ఇన్‌చార్జి గుంటి వేణుగోపాల్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ సభా భవనంలో ఆదివారం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్యక్షతన ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా ఆశాలు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సెలవులు లేకుండా పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని అప్పటివరకు కనీస వేతనం కింద రూ. 26వేలు చెల్లించాలన్నారు. రూ. 10లక్షల ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని, కరోనా అలవెన్స్ తక్షణమే అందివ్వాలని కోరారు. రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమ్మ, గౌరవాధ్యక్షుడు గంగాధర్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కో-కన్వీనర్ సరోజమ్మ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మహిళా సమాఖ్య నాయకులు సుమిత్రమ్మ, కనకమ్మ, నారాయణమ్మ, రజియా తదితరులు పాల్గొన్నారు.

కోతి దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి మండలం ఎగువపల్లె గ్రామంలో వృద్ధురాలిపై కోతి దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గుమ్మళ్ల వెంకటసుబ్బమ్మ ఇంట్లో ఉండగా ఆదివారం ఉదయం ఒక కోతి ఇంటి లోపలికి వచ్చి ఆమె తలపై దాడి చేసింది. తీవ్రంగా రక్తస్రావం జరిగింది. గ్రామస్తులు ఆమెను హుటాహుటిన కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కోతి కాటుకు టీకాలు వేశారు. రక్త స్రావం ఆగకపోవడంతో కుట్లు వేయడం సాధ్యం కాలేదని వైద్యులు తెలిపారు. ఒకటి, రెండు రోజుల తర్వాత కుట్లు వేస్తామని చెప్పారు. ఎగువపల్లె గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

మూడు పురాతన పంచలోహ విగ్రహాలు చోరీ

కొండాపురం : కొండాపురం మండల పరిధిలోని బెడుదూరు గ్రామంలో శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి పురాతన శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవారి పంచలోహ విగ్రహాలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఘటనా స్థలాన్ని కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశవరెడ్డి, కడప క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ టీంలు పరిశీలించారు. ఆలయ నిర్వాహకులు, స్థానికుల వివరాల మేరకు ఆదివారం ఉదయం దేవస్థానానికి వెళ్లగా గుడి తాళం పగలగొట్టి ఉండటంతో ఈ విషయాన్ని పూజారి నక్కలపల్లి సురేష్ బాబు స్థానిక గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ పురాతన పంచలోహ విగ్రహాల ధర సుమారు రూ.30 నుంచి 50 లక్షల వరకు ఉండవచ్చని అంచనా.

స్కూటీని ఢీకొన్న లారీ

దువ్వూరు : పాత దువ్వూరులోని ఆంజనేయస్వామి బైపాస్ రోడ్డులో ఆదివారం స్కూటీని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువతి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మైదుకూరు మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రావ్య(19) మైదుకూరులో డిగ్రీ చదువుతోంది. ఆమె తన పెద్దనాన్న నారాయణరెడ్డితో కలసి స్కూటీపై వెంకుపల్లె గ్రామానికి వచ్చింది. తిరిగి దువ్వూరుకు వెళ్తుండగా నంద్యాల వైపు నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో శ్రావ్యకు తీవ్రగాయాలు కాగా, నారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రావ్య అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వినోద్ కుమార్ తెలిపారు.

దేవుడి భూములు అమ్మేసిన టీడీపీ నాయకుడు


సీటీఎం అభయాంజనేయస్వామి ఆలయం


రెవెన్యూ రికార్డుల్లో ఆంజనేయస్వామి తత్కాల మేనేజర్‌గా రెడ్డిస్వామి తాత కరణం డాకరాజు

- ఇది మంచి ప్రభుత్వంలో ఎమ్మెల్యేకు ఫిర్యాదు
- అయినా పట్టించుకోని వైనం

మదనపల్లె : అభయాంజనేయస్వామి ఆలయ బాగోగులు చూసే నెపంతో, దేవుడి భూములను ఓ టీడీపీ నాయకుడు అమ్మి సొమ్ములు చేసుకున్నాడు. దేవుడి భూములు కాజేసిన నాయకుడిపై వందరోజుల పాలన సందర్భంగా సీటీఎం క్రాస్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఫిర్యాదు అందింది. అయితే భూములు అమ్ముకున్న వ్యక్తి టీడీపీ నాయకుడు కావడంతో, ఫిర్యాదు అందినా పట్టించుకోకుండా, కనీసం మాట మాత్రమైనా ప్రస్తావించకుండా ఎమ్మెల్యే దాటవేత ధోరణి అవలంబించారు. దీంతో ఫిర్యాదుదారుడు ఎం.గురుప్రసాద్.. ఆంజనేయస్వామి భూములు కాజేసిన టీడీపీ నాయకుడిపై సాక్షికి వివరాలు వెల్లడించారు. సీటీఎం గ్రామ రెవెన్యూ దాఖలా సర్వే నంబర్.995ఏ, 995బిలో చిన్నతిప్పసముద్రంలోని అభయాంజనేయస్వామి పేరుపై 5.14 ఎకరాల భూమి ఉంది. సీటీఎం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు రెడ్డి రాంప్రసాద్ అలియాస్ రెడ్డిస్వామి కుటుంబీకులు ఆంజనేయస్వామి ఆలయ నిర్వహణ చేసేవారు. ఈ భూములకు ప్రభుత్వ రెవెన్యూ ఏ రిజిస్టర్‌లో ఆంజనేయ స్వామి వారి ఆలయానికి తత్కాల మేనేజర్‌గా కరణం డాకరాజుగా ఉంది. కరణం డాకరాజు, రెడ్డిస్వామికి తాత కావడంతో, ఈ భూములు తమవేనని చెప్పుకోవడమే కాకుండా, సర్వహక్కులు తమకే చెందుతాయని చెప్పి క్రమక్రమంగా అమ్మకాలు మొదలు పెట్టారు. రెడ్డిస్వామి కుటుంబ సభ్యులు అమ్మేసిన భూముల విలువ సుమారు రూ.2కోట్లకు పైగానే ఉంటుంది. ఈ విషయమై గతంలో పలుమార్లు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా, రెడ్డిస్వామి పలుకుబడితో వాస్తవాలు బయటపడకుండా చేశాడు. దేవుడి భూములు విక్రయించిన టీడీపీ నాయకుడు రెడ్డిస్వామి, కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకుని, కాజేసిన సొమ్మును స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.